ప్రజాశక్తి
మంగళవారం 28 మార్చి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పదోతరగతి పరీక్షలు

సజావుగా సాగేలా చర్యలు

- కేంద్రాల వద్ద 144 సెక్షన్
- కలెక్టర్ విజయకృష్ణన్



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పదోతరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.విజయకష్ణన్ ఆదేశించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణపై అనుబంధ శాఖల అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. పబ్లిక్ పరీక్షల ఏర్పాట్లలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలని, జెరాక్స్ మిషన్లు మూత వేయించి.. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బాపట్ల జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీ క్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు అంతరాయం లేకుండా విద్యుత్ సర ఫరా చేయాలని, పరీక్షా కేంద్రాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోడానికి ఆర్.టి.సి. బస్సులను నడపాలని ఆదేశించారు. వేసవిని దష్టిలో ఉంచుకొని ప్రాథమిక వైద్యం కోసం ప్రతి కేంద్రం వద్ద ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ఐవిసెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం బాపట్ల జిల్లాలోనే తొలిసారిగా జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచి ప్రశ్నా పత్రాలు తరలించేటప్పుడు పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. స్పాట్ ఆఫీసర్లను ప్రత్యేకంగా నియమించాలని తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, ఇన్విజిలేటర్లు, ఆయా అనుబంధ శాఖల అధికారులను నియమిస్తూ తక్షణమే ఉత్తర్వులు పంపాలన్నారు. బాపట్ల జిల్లాలో 17,344 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఏప్రిల్-3 నుంచి 18వ తేదీ వరకు పదోతరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు రెగ్యులర్ విద్యార్థులకు, అదే క్రమంలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరుగుతాయన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, ఎ.ఎస్.పి. మహేష్, డిఆర్వో కె.లక్ష్మీశివజ్యోతి, డిఇఒ పి.వి.రామారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, డిపిఓ వై. శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

అమ్మ కోరిక నెరవేరుస్తా.!

- 'వరికూటి'కి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా
- కారుమంచిలో కోటమ్మకు ఘన నివాళి



వరికూటి కోటమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-టంగుటూరు

'ఆలోచనే వద్దు.. అమ్మ కోరిక నెరవేరుస్తా..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్‌రెడ్డి వరికూటికి భరోసా ఇచ్చారు. సోమవారం టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలో వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి మాతృమూర్తి వరికూటి కోటమ్మ(82) భౌతికకాయం వద్ద సిఎం జగన్ పుష్పగుచ్ఛం ఉంచి.. ఘనంగా నివాళు లర్పించారు. కోటమ్మ కుటుంబసభ్యులు వరికూటి అశోక్‌బాబు, సతీమణి లక్ష్మి, వరికూటి అమృతపాణి, సతీమణి పశుసంవర్ధక శాఖ జేడీప డాక్టర్ కే.బేబీరాణి, ఇతర కుటుంబ సభ్యులను సిఎం జగన్ పరామర్శించారు. సిఎం జగన్‌తో పాటు మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు కరణం వెంకటేష్‌బాబు, బాచిన కృష్ణచైతన్య కోటమ్మ భౌతికకాయం వద్ద నివాళు లర్పించారు.

అమ్మ కోరిక అదే..

జగన్ పక్కనే ఉన్న వరికూటి అశోక్‌బాబు సోదరుడు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి మాట్లాడుతూ 'అశోక్ ఎమ్మెల్యే కావాలన్నది అమ్మ కోరిక' అని చెప్పగా సీఎం జగన్ వెంటనే స్పందిస్తూ 'ఆలోచనే వద్దు.. అమ్మ కోరిక నెరవేరుస్తా' అని సిఎం బదులిచ్చినట్లు అక్కడే ఉన్న పలువురు సన్నిహితులు పేర్కొన్నారు. కొండపి ఎస్సీ నియోజకవర్గంలోని పార్టీ ఇన్‌ఛార్జి తల్లి మరణిస్తే కారుమంచి గ్రామానికి సీఎం వచ్చారంటేనే అశోక్‌బాబుకు ఎమ్మెల్యే సీటుపై వస్తున్న పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టినట్లయిందని కొండపి నియోజకవర్గంలో విస్తృతంగా చర్చ నడుస్తోంది. ఇక్కడ మరో విశేషం ఏమంటే.. తొలుత సంతనూతలపాడులో చేయాల్సిన కోటమ్మ అంత్యక్రియలను అశోక్‌బాబు స్వగ్రామం కారుమంచి గ్రామానికి మార్చడం. ఆదివారం మధ్యాహ్నం వరకూ కోటమ్మ అంత్యక్రియలను సంతనూతలపాడులోనే చేయాలని భావించి అక్కడే ఏర్పాట్లు కూడా చేశారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో సీఎం జగన్ ▶ 2లో

ఇసుకను దోచేస్తున్నారు.!

- యథేచ్ఛగా అక్రమ రవాణా
- అధికార పార్టీ నేతల కనుసన్నలోనే..
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం



రేవులో ఇసుకను తరలించాక ఏర్పడిత గుంతలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు (కొల్లూరు)

కృష్ణానది కొందరు అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వం ఇసుకను కొన్ని రీచ్‌లకు అనుమతినిచ్చింది. అక్కడ మాత్రమే ఇసుకను టన్నుల లెక్కన కొనుగోలు చేసుకోవాలని పేర్కొంది. ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు జరగటం లేదు. దీంతో అనుమతులు లేని రీచ్‌ల నుండి కొందరు అధికారపార్టీ నాయకులు అక్రమ ఇసుక తరలింపునకు పూనుకున్నారు. ముఖ్యంగా జువ్వలపాలెం, చింతల్లంక గ్రామాల వద్ద నదిలో రహదారులు ఏర్పాటు చేసి.. మరీ అధికార పార్టీ ముఖ్య నాయకులు, గ్రామ సర్పంచ్‌లు ఇసుకను తరలిస్తున్నారు. జువ్వలపాలెంలో సాక్షాత్తు సర్పంచే స్వయంగా ట్రాక్టర్‌ను ఏర్పాటుచేసి.. బహిరంగంగా ఇసుకను తరలిస్తున్నారు. టైరు బండ్లపై ఇసుకను తొలుకునే వారి నుండి కూడా బండికి వంద రూపాయల చొప్పున అధికారపార్టీ నేతలు బెదిరించి మరీ వసూళ్లు చేపట్టటం గత రెండేళ్లుగా కొనసాగుతూనే ఉంది. ఇసుక అక్రమ తరలింపు నియోజకవర్గ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరుగుతుందని బహిరంగ చర్చ. చింతల్లంకలో అరవింద వారధి పక్కన రహదారి ఏర్పాటు చేసి మరీ నాయకులు ఇసుకను తరలిస్తున్నారు. దీని కారణంగానే వారధి పక్కనున్న ఆర్‌సి భూములు దళితులు సాగుచేసుకునేందుకు సిద్ధపడగా ఇసుక తరలింపునకు దళితులు ఆటంకంగా మారతారనే ఆలోచనతో వారిపై దాడి చేసి.. నాయకులపై అక్రమ కేసులు బనాయించిన విషయం తెలిసిందే..

పైసలిస్తే సరే.. లేకుంటే పోలీస్‌స్టేషన్‌కే..

ఇసుక అక్రమ తరలింపు కొల్లూరు పోలీసు, రెవెన్యూ అధికారుల అక్రమ ఆదాయానికి ఉపయోగపడుతోంది. ఇసుక తరలించే వాళ్లు డబ్బులిస్తే సరి.. లేకుంటే ట్రాక్టర్ పోలీస్‌స్టేషన్లో ఉంటుంది. మామూళ్లు ఇచ్చిన రోజున రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అటు వైపు కన్నెత్తి కూడా చూడరు. మామూళు ఇవ్వకుంటే ఇసుక ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్లో ఉంటాయి. జిల్లా మార్పుతో పోలీస్ సర్కిల్ కార్యాలయం కూడా వేమూరుకు మారింది. కొల్లూరుకు కూతవేటు దూరంలోనే ఉంది. కానీ ఈ అక్రమార్కులపై ఎలాంటి చర్యలూ ఉండవు. పైన నాయకుల ▶ 2లో



104 వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌ను

విజయవంతం చేయాలి

104 వాహనాలను ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గడపగడపకూ వైద్య సేవల లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రకాశం జిల్లాకి ప్రస్తుతం అదనంగా 10 కొత్త 104 సంచార వైద్య వాహనాలు మంజూరు చేయగా స్థానిక ప్రకాశం భవనంలో కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 104 వాహనాలు 38 ఉన్నాయని, ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు అదనంగా మరో 10 వాహనాలు మంజూరయ్యాయన్నారు. వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఎక్కువగా ఉన్న త్రిపురాంతకం, మార్కాపురం, కనిగిరి, దర్శి, మద్దిపాడు, టంగుటూరు, చీమకుర్తి, కొనకనమిట్ల, నాగులుప్పలపాడు వాటిని కేటాయించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్. రాజ్యలక్ష్మి, ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ మాధవీలత, ఎఇఎంఎస్ 108 జిల్లా మేనేజర్ విజయకుమార్, ఎఇఎంఎస్ 104 జిల్లా మేనేజర్ జిలాని, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ డి. కోటేశ్వరరావు, బి. శ్రీకాంత్ పాల్గొన్నారు.

అమ్మ కోరిక నెరవేరుస్తా.!

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి కె.నాగేశ్వర్‌రెడ్డి నుండి అశోక్‌బాబుకు ఫోన్ కాల్ వచ్చింది. సీఎం జగన్ అశోక్‌బాబుతో ఫోన్‌లో మాట్లాడుతూ 'అమ్మ అంత్యక్రియల ఏర్పాట్లు నీ నియోజకవర్గంలోనే చేసుకో.. నేను వస్తున్నా..' అని చెప్పడంతో కార్యక్రమం షెడ్యూల్ అంతా తారుమారైనట్లు చెబుతున్నారు. ఆ సమయంలో ఒంగోలులోనే ఉన్న అందరూ ఉరుకులు పరుగులతో కారుమంచికి పరుగులు తీశారు. అశోక్‌బాబుతో చర్చించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికగర్గ్.. కారుమంచిలో హెలిప్యాడ్ స్థలాన్ని ఖరారు చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న కారుమంచి జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్ ఆవరణను ఫ్లడ్ లైట్లు పెట్టి హెలిప్యాడ్, సీఎం కాన్వాయ్‌కు సిద్ధం చేయడం లాంటి అన్ని పనులూ రాత్రికి రాత్రే చకచకా జరిగిపోయాయి.

ఇసుకను దోచేస్తున్నారు.!

(మొదటిపేజీ తరువాయి)

నుండి ఫోన్ రానప్పుడు మాత్రమే అక్రమ ఇసుక రవాణా వాహనాలపై చర్యలు ఉంటాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిస్థితి ఇదే రీతిలో కొనసాగితే లంక గ్రామాల భూములలో భూగర్భ జలాలు తగ్గి.. పంటలకు ముప్పు ఏర్పడే ప్రమాదముంది.

ఒంగోలులో 'ఆసరా' బైకు ర్యాలీ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఆసరా కార్యక్రమంతో మహిళా స్వయం సహాయక సంఘాలు మరింత బలోపేతం అవుతాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. మూడో విడత ఆసరా ఉత్సవాల్లో భాగంగా మెప్మా మహిళా సంఘాల సభ్యులు సోమవారం నగరంలో బైకు ర్యాలీ నిర్వహించారు. అద్దంకి బస్టాండ్‌లోని మెప్మా కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ ట్రంకురోడ్డు మీదుగా కలెక్టరేట్, నెల్లూరు బస్టాండ్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ నిర్వహించారు. తొలుత ర్యాలీని కమిషనర్ వెంకటేశ్వం ్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆసరా పథకంలో భాగంగా ఇప్పటి వరకు ఒంగోలు నగరంలో రూ.96.30 కోట్లు రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. అందులో మూడో విడతలో రూ. 24.80 కోట్లు మాఫీ చేశారని చెప్పారు. వివిధ బ్యాంకుల్లో స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలపై ఉన్న వడ్డీని నాలుగు విడతలుగా మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆసరా పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హామీలో భాగంగా ఇప్పటి వరకు మూడు విడతల్లో మహిళలకు రుణమాఫీ చేశారని పేర్కొన్నారు. రుణమాఫీ వల్ల స్వయం సహాయక సంఘాల్లో ఉన్న సభ్యులకు ఎంతో మేలు చేకూరు తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కొండయ్య, వైసిపి నాయకులు కఠారి శంకర్, గంటా రాము, మెప్మా రిసోర్సు పర్సన్లు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు తదితరులు పాల్గొన్నారు.



బైకు ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్

వర్షానికి దెబ్బతిన్న పంటలు పరిశీలన

మార్కాపురం రూరల్ : ఇటీవల కురిసిన వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందిస్తామని ఎఒ దేవిరెడ్డి శ్రీనివాసులు, ఉద్యానవన అధికారి రమేష్ తెలిపారు. మండల పరిధిలోని గజ్జలకొండ గ్రామ రైతుభరోసా కేంద్రం పరిధిలో రెండు మూడు రోజులుగా వీస్తున్న ఈదురు గాలులు, వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, అరటి పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చేల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాధికారులు, ఉద్యానవన శాధికారులుపాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా 'మద్ది'

చీమకుర్తి : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మద్ది వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. మండల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు గంట అంజిబాబు, సంతనూతలపాడు కాంగ్రెస్ ఇన్‌ఛార్జి తుమ్మల సుబ్బారావు అతిథులుగా పాల్గొన్నారు. ఈ

రుద్రసముద్రంలో అన్నదానం

ప్రజాశక్తి-దొనకొండ

మండల పరిధిలోని రుద్రసముద్రం నూతన నిర్మించిన పోలేరమ్మ ఆలయంలో విగ్రహా ప్రతిష్ట సోమవారం ఘనంగా నిర్వహించారు. ఓర్వకంటి సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో అర్చకుల బృందం వేద మంత్రాల నడుమ పోలేరమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించారు. చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అన్నదానం నిర్వహించారు.

29న టిడిపి ఆవిర్భావ దినోత్సవం

పొన్నలూరు : టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఈ నెల 29న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు, కొండపి ఎఎంసి మాజీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు సోమవారం తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల పరిధిలోని టిడిపి గ్రామ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, టిడిపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒంగోలు
HM.OP.No: 135/2022

Between
చిర్లదిన్నె పావని ..... పిటిషనర్
వర్సెస్
పోల్లిమర్ల శ్రీహరి .... రెస్పాండెంట్
టు
పోల్లిమర్ల శ్రీహరి,కొత్త కొల్లీమెర్ల గ్రామం,
వేటపాలెం మండలం, ప్రకాశం జిల్లా
(ప్రస్తుతం బాపట్ల జిల్లా)

పై దావా లో ఎన్ని పర్యాయములు మీ అడ్రస్ కు కోర్టు వారి ద్వారా పోస్ట్ చేయగా మరియు కోర్టు ద్వారా పంపిన ను అవి జారి జరిగి ఉండలేదు కావున ఈ ప్రకటన ద్వారా తేదీ 21.04.2023న ఉదయం 10.30 గంటలకు పైకోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని హాజరు కావలసినది లేని యెడల మీ పరోక్షముగా దావా తీర్మానించబడు నని తెలియజేయడమైనది

వాయిదా తేదీ : 21.04.2023

ఇట్లు
మాచిరాజు శ్రీనివాసరావు
అడ్వకేట్, ఒంగోలు

మహారాజశ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం:100/2019

నల్లమలపు వెంకట రమణమ్మ ...వాది
వర్సెస్
పాతకోట నాగార్జునరెడ్డి ...ప్రతివాది
టు,
పాతకోట నాగార్జునరెడ్డి, తండ్రి :వెంకటసుబ్బారెడ్డి, డోర్ నెం:29-533,ఎన్.జి.ఓ.కాలనీ, పవర్ ఆఫ్ ఎదురుగా, ఒంగోలు టౌన్,ప్రకాశం జిల్లా.
అనువారికి,

పై నంబరు దావాలో పరిహారం నిమిత్తం, వాది నీ మీద దావా దాఖలు చేసినందున నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకు నోటీసులు పంపించిననూ జారీ కానందున శ్రీ కోర్టు వారు నీ నోటీసు నిమిత్తం వాయిదా తేదీ: 29-03-2023 కు వాయిదా వేసి ఉన్నారు. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో నీ పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేదీ: 29-03-2023
తేది:27-03-23
పొదిలి ఇట్లు
ఎం.వి.రమణకిషోరు, బి.కామ్,ఎల్.ఎల్.బి.
అడ్వకేట్ మరియు నోటరీ,
పొదిలి, ప్రకాశం జిల్లా,
సెల్ :9948139224.

గ్రామ పంచాయతీ కార్యాలయం,
ఓలేరు గ్రామం,భట్టిప్రోలు మం, బాపట్ల జిల్లా
టెండర్ ప్రకటన

ది.27-3-23

బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం,ఓలేరు గ్రామ పంచాయతీకి ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా 2023-24 సంవత్సరం నకు సంభందించి టెండరు పద్ధతిపై పని చేయుట,అవసరమైన సామగ్రి ని సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కొరబడుతున్నవి.ఆసక్తి కలవారు తగిన ధరవతు చెల్లించి సీల్డ్ వేసిన టెండర్లు దాఖలు చేయవలెను.ది 29-3-23 న 11.00 గం కు స్వీకరించబడి అదే రోజు 12.00 గం హాజరైన టెండరు దార్ల సమక్షంలో తెరవబడును.ధరవతు చెలించని టెండర్లు తిరస్కరించబడును.టెండర్లు నిలిపివేయుట లేదా వాయిదా వేయుటకు కార్యదర్శి వారికి అధికారము కలదు.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	ధరావత్తు(రు)
1.	2023-24 కు గాను టెండరు పద్ధతి పై పని చేయుట మోటారు ఆపరేటర్ కం నైట్ వాచర్-1	100.00
2.	2023-24 కు గాను టెండరు పద్ధతి పై పి డబ్ల్యూ ఎస్ సామానులు సరఫరా చేయుట	100.00
3.	2023-24 కు గాను పి హెచ్ సి సామాన్లు సరఫరా చేయుట	100.00
4.	2023-24 కు గాను పంపు సామాన్లు సరఫరా చేయుట	100.00

స్థలం:ఓలేరు సం/-ఏ.శ్రీదేవి
తేదీ. 27.3.23 గ్రామ పంచాయతీ కార్యదర్శి
ఓలేరు,భట్టిప్రోలు(మం),బాపట్ల జిల్లా

బహిరంగ వేలం ప్రకటన
గ్రామ పంచాయతీ కార్యాలయం, పెద్దదోర్నాల

ఆర్.ఓ.సి. నెం 1/2023 **తేదీ: 24-03-2023**

ప్రకాశం జిల్లా దోర్నాల మండలం దోర్నాల గ్రామ పంచాయతీ, ఈ క్రింద తెలిపిన విధముగా బహిరంగ వేలం పాటలు తేదీ: 29-03-2023 బుధవారం మధ్యాహ్నం 3 గం॥ల నుండి వేలం పాటలు జరుగును. 2023 సంవత్సరమునకు దోర్నాల గ్రామ పంచాయతీకి చెందిన నేతాజీ మార్కెట్ కాంప్లెక్స్ రూముల వేలం పాటలు గ్రామ పంచాయతీ కార్యాలయం నందు జరుగును. రూముల వేలం పాటలో పాల్గనదలచిన వారు రూ. 1,50,000/- అక్షరాల లక్షా యాభైవేల రూపాయలు విలువ గల సాల్వెన్సీ ధృవపత్రం తహశీల్దారు వారి వద్ద నుండి తీసుకొనవలయును. మిగిలిన వివరములు కార్యాలయము పని వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	రూ.లు
1)	కె.జి.రోడ్డు వైపున గల 1 నుండి 5 వరకు మరియు 26వ రూముకు	రూ. 50,000/- రూపాయలు ధరావత్తు చెల్లించవలెను
2)	6 నుండి 16 వరకు గల రూములు లోపల షట్టర్లు గల రూములకు	రూ. 25,000/-రూపాయలు ధరావత్తు చెల్లించవలెను
3)	17 నుండి 25వ రూములకు షట్టర్లు లేనివి	రూ.15,000/-రూపాయలు ధరావత్తు చెల్లించవలెను

షరతులు:-

1.గ్రామ పంచాయతీ నోటిఫికేషన్ ప్రకారం పాటలు జరుపబడును
2. షరతులకు లోబడి వేలం పాటలలో పాల్గనవలయును.
3. ఎటువంటి కారణం తెలుపకుండానే వేలం పాటను వాయిదా వేయుటకు పంచాయతీ కార్యదర్శి గారికి అధికారం కలదు.

ఇట్లు
పంచాయతీ కార్యదర్శి
గ్రామ పంచాయతీ, దోర్నాల.

గ్రామ పంచాయతీ కార్యాలయం,
రాచూరు, భట్టిప్రోలు మం, బాపట్ల జిల్లా
టెండర్ ప్రకటన

ది.27-3-23

బాపట్ల జిల్లా,భట్టిప్రోలు మండలం,రాచూరు గ్రామ పంచాయతీ కి ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా 2023-24 కు సంభందించి టెండరు పద్ధతి పై పని చేయుట,అవసరమైన సామాన్లు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కొరబడుచున్నవి.ఆసక్తి కలవారు తగిన ధరవతు చెల్లించి సీల్డ్ టెండర్లు దాఖలు చేయవలెను.ది.29-3-23 మధ్యాహ్నం 2.00 గం స్వీకరించబడి అదే రోజు 3.00 గం కు హాజరైన టెండరు దార్ల సమక్షంలో తెరవబడును. ధరవతు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.టెండర్లు నిలిపి వేయుట,లేదా రద్దు చేయుటకు కార్యదర్శి వారికి అధికారము కలదు.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	ధరావత్తు(రు)
1.	2023-24 కు గాను టెండరు పద్ధతి పై ట్యాంక్ వాచర్ గా పని చేయుట	100.00
2.	2023-24 కు గాను పి డబ్ల్యూ ఎస్ సామాన్లు సరఫరా చేయుట	100.00
3.	2023-24 కు గాను పి హెచ్ సి సామాన్లు సరఫరా చేయుట	100.00
4.	2023-24 కు గాను పంపు సామాన్లు సరఫరా చేయుట	100.00

స్థలం : రాచురు. సం/-ఏ.శ్రీదేవి
తేదీ. 27.3.23 గ్రామ పంచాయతీ కార్యదర్శి
రాచూరు,భట్టిప్రోలు మం, బాపట్ల జిల్లా

గ్రామ పంచాయతీ కార్యాలయం,
కన్నెగంటివారిపాలెం, భట్టిప్రోలు మం, బాపట్ల జిల్లా
టెండర్ ప్రకటన

ది.27-3-23

బాపట్ల జిల్లా,భట్టిప్రోలు(మం),కన్నెగంటివారిపాలెం గ్రామ పంచాయతీకి ఈ దిగువ షెడ్యూల్డ్ దాఖలా 2023-24 సంవత్సరానికి సంభందించి టెండరు పద్ధతి పై పని చేయుట,అవసరమైన సామాన్లు సరఫరా చేయుటకు గాను సీల్డ్ టెండర్లు కొరబడుచున్నవి. ఆసక్తి కలవారు తగిన ధరవతు చెల్లించి సీల్డ్ టెండర్లు దాఖలాలు చేయవలెను.ది.29-3-23 న మధ్యాహ్నం 12.30 గం స్వీకరించబడి అదే రోజు 1.00 గం కు హాజరైన టెండరు దార్ల సమక్షంలో తెరవబడును.టెండర్లు నిలిపివేయుట లేదా రద్దు చేయుటకు కార్యదర్శి వారికి అధికారము కలదు.

షెడ్యూలు

వ.నెం.	వివరములు	ధరావత్తు(రు)
1.	2023-24 కు గాను టెండరు పద్ధతి పై పి డబ్ల్యూ ఎస్ సామాన్లు సరఫరా చేయుట	100.00
2.	2023-24 కు గాను పి హెచ్ సి సామాన్లు సరఫరా చేయుట	100.00
3.	2023-24 కు గాను పంపు సామాన్లు సరఫరా చేయుట	100.00

స్థలం : కన్నెగంటివారిపాలెం సం/-ఏ.శ్రీదేవి
తేదీ. 27.3.23 గ్రామ పంచాయతీ కార్యదర్శి
కన్నెగంటివారిపాలెం,భట్టిప్రోలు మం, బాపట్ల జిల్లా

ఉన్నత చదువుకు గోల్డెన్ జూబ్లీ సత్కారం

ఒక్కచోట చేరిన 50 ఏళ్లనాటి డిగ్రీ విద్యార్థులు

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానికంగా ప్రాథమిక విద్యను అభ్యసించి 1970లో బాపయ్య హైస్కూల్‌లో హెచ్ఎస్ఎస్‌సి అభ్యసించిన పూర్వ విద్యార్థులు సోమవారం గెట్ టుగెదర్ ఏర్పాటు చేసుకున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి వ్యాపార, ఉద్యోగాలు చేసి విశ్రాంత జీవితం గడుపుతున్నారు. వీరు డిగ్రీ పూర్తి చేసి 50 వసంతాలు నిండాయి. వీరు వేటపాలెంలోని పట్టభద్రుల సంఘం వ్యవస్థాపక సభ్యులు. అనేక సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా పట్టబద్ధుల సంఘం వారు 1973లో డిగ్రీ పూర్తి చేసి గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్న వీరిని ఆత్మీయంగా కలసి అభినందనలు తెలిపి, సత్కరించుకున్నారు. వ్యవస్థాపక సభ్యులు ప్రత్తి చంద్రశేఖర్, వలివేటి గుప్తా, పూట్ల వెంకటేశ్వర్లు, నున్నా మస్తాన్‌రావు, ఎస్ఎస్‌కే మూర్తి, పోలుదాశు బ్రహ్మానందం, ఊటుకూరి సుధాకర్లను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా పెద్దలు చంద్రశేఖర్, సుధాకర్ మాట్లాడుతూ ఈ సంఘానికి సహాయ సహకారాలు అందించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలుపుతూ, ఈ సందర్భంగా చంద్రశేఖర్ వారి కుమార్తె శ్రీవాసవి, యూఎస్ఏ వారు పట్టభద్రుల సంఘం ద్వారా సహాయ సహకారం పొందుతున్న ఎంబీబీఎస్ ఫోర్త్ ఇయర్ చదువుతున్న లక్ష్మీ సంధ్య చదువుకు 28 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 50 సంవత్సరాలు అయిన పెద్దలు తమ సంఘంలో వ్యవస్థాపక సభ్యులయి ఉండటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సరస్వతి దేవికి పుట్టినిల్లయిన వేటపాలెం గ్రామంలో ఇంతటి విద్యావంతులు ఒకచోట కలవటం చాలా సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక సభ్యులు ప్రత్తి కృష్ణమూర్తి, రావి మస్తాన్‌రెడ్డి, బట్ట మోహన్‌రావు, గుడిమూటి శేఖర్, గుంటి సుబ్రహ్మణ్యం, శివారెడ్డి, సుబ్రహ్మణ్యం, బోల్లేపల్లి బెంజిమెన్, ఓంకారేశ్వర బాబు, పాల్గొన్నారు.



సత్కారం అందుకున్న నాటి విద్యార్థులు

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌పై కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-వెలిగండ్ల: స్థానిక టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన హౌస్‌హెూల్డ్ ప్యాపింగ్‌పై శిక్షన కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టిడిపి శిక్షకుడు అంకయ్య కార్యకర్తలకు రాబోయే ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయకుండా ప్రతి గ్రామాల్లో, ప్రతి ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయి. అర్హత ఉన్న ఓటర్లు ఎవరైనా ఉన్నారా అని ఇంటింటికీ తిరిగి హౌస్‌హెూల్డ్ మ్యాపింగ్ ద్వారా గుర్తించాలన్నారు. తద్వారా రాబోయే ఎన్నికల్లో దొంగ ఓట్లు లేకుండా నిజమైన ఓటర్లను గుర్తించవచ్చునన్నారు. అనంతరం వెలిగండ్లలోని బిసి కాలనీలో ఇంటింటికీ తిరిగి హౌస్‌హెూల్డ్ మ్యాపింగ్ కార్యక్రమా న్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కారంపూడి వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, మాలకొండారెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గోనా వెంకటయ్య, మండల ఐటిడిపి కోఆర్డినేటర్ దేవా, తాలూకా ఐటిడిపి కార్యదర్శి నల్లబోతుల నాగరాజు, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, కె కాశిరెడ్డి, బత్తుల తిరుపతిరెడ్డి, నారాయణరెడ్డి, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో టిడిపి ప్రచార రథం పర్యటన

ప్రజాశక్తి-వెలిగండ్ల

వైసిపి పాలన వైఫల్యాలను ప్రతిపల్లె వివరించేందుకు టిడిపి హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులను వివరించేందుకు మాజీ శాసనసభ్యులు, టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పల్లెపల్లెకూ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నారు. అందుకోసం ప్రత్యేకంగా తయారు చేసిన రథాన్ని సోమవారం వెలిగండ్ల మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. అన్ని మండలాల్లో 135 పంచాయతీల్లో 440కు పైగా గ్రామాల్లో ఈ రథం ద్వారా ఉగ్రనరసింహారెడ్డి చేపట్టనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం తెలిపారు.



ప్రచార రథంతో టిడిపి కార్యకర్తలు

పదో తరగతి విద్యార్థులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉప్పుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరన్నపాలెం హైస్కూలు, చెరుకూరులోని పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షకు అవసరమైన కిట్లు పంపిణీ చేశారు. నర్రా వెంకట్ లక్ష్మీసుధ ఆర్థిక సహాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కె ఆంజనేయులు, కె సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



కిట్లు అందుకున్న విద్యార్థులు

ఆపరేషన్ చేయించి కళ్ళజోళ్లు అందజేత

ప్రజాశక్తి-భట్టిప్రోలు

పల్లెకోన గ్రామానికి చెందిన గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి సాల్మన్‌రాజ్ ఇటీవల పలు మండలాలలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కొల్లూరులో జరిగిన శిబిరంలో 80 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని, వైద్యులు సూచించిన మేరకు వారికి ఆపరేషన్ చేయించి సోమవారం కళ్ళజోళ్లు అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. అమృతలూరు మాజీ ఎంపిపి మైనేని రత్నప్రసాద్, ఫౌండేషన్ సభ్యులు యన్నం సురేష్, యల్లమాటి దాసు, గురవయ్య, మునిపల్లి రవి ఉన్నారు.




కళ్లజోళ్ల పంపిణీ దృశ్యం

చంద్రబాబుకు దమ్ముందా?: బుర్రా

ప్రజాశక్తి-వెలిగండ్ల

రాబోయే ఎన్నికల్లో సంక్షేమ పథకాలు కొనసాగిస్తానని హామీ ఇచ్చే దమ్ము చంద్రబాబుకు ఉందా అని శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ విమర్శించారు. రాబోయే 2024 ఎన్నికల్లో ప్రస్తుతం సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగిస్తానని చెప్పి ఎన్నికలకు వెళ్లే దమ్ము చంద్రబాబుకు ఉందా అన్నారు. సోమవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో వైఎస్ఆర్ 3వ విడత ఆసరా పథకాన్ని ఆయన ప్రారంభించారు. పొదుపు సంఘాలకు మంజూరైన చెక్కులను అందజేశారు. మండలంలో 525 గ్రూపులకు గానూ 5,167 మంది సభ్యులకు 3వ విడతలో రూ.4.22 కోట్ల మంజూరైనట్లు తెలిపారు. మొత్తం మూడు విడతలుగా రూ.12.66 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రతి మహిళా ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి నిజాయితీగా పని చేస్తుంటే ప్రతిపక్షాలు సిఎంపై లేనిపోని అవాకులు, చవాకులు పేలుస్తూ విమర్శలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి ఎన్నికల్లో వెలిగండ్ల మండలం నుంచి భారీ మెజారిటీతో గెలిపించారని, రాబోయే ఎన్నికల్లో 7వేలకు పైగా మెజారిటీతో గెలిపించాలని కోరారు.



చెక్కు పంపిణీ చేస్తున్న బుర్రా

జడ్‌పిటిసితో రహస్య మంతనాలు

జగనన్న 3వ విడత ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం అనంతరం స్థానిక జడ్‌పిటిసి కార్యాలయంలో శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్, జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి కలిసి గంటపాటు రహస్యంగా చర్చించుకోవడం గమనార్హం. గత కొన్ని రోజులుగా శాసనసభ్యులు నిర్వహించిన కార్యక్రమాల్లో జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి పాల్గొనకపోవడంతో వారి మధ్య మనస్పర్థలు వచ్చాయని సమాచారం. ఈ నేపథ్యంలో రహస్య మంతనాలు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామన మహాలక్ష్మి, జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి, రాష్ట్ర ఆర్యకటిక ఛైర్మన్ లక్ష్మీకుమారి, సింగిల్‌విండో అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు పొల్లా సుబ్రమణ్యం, మాజీ జడ్‌పిటిసి రామన తిరుపతిరెడ్డి, సర్పంచి తాతపూడి సురేష్‌బాబు, నాగూర్‌యాదవ్, మండల బిసిసెల్ అధ్యక్షులు ఎలిక రమణయ్య, కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, కుప్పనబోయిన వెంకటరామయ్య, ఎంపిటిసి మేరి పుష్ప, ఎంపిడిఓ తాతపూడి సుకుమార్, ఎపిఓ లక్ష్మీనారాయణ, ఏరియా కోఆర్డినేటర్ కత్తి కళ్యాణ్, ఉపాధ్యాయులు తాతపూడి దేవసహాయం, పొదుపు మహిళలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న పోలీసులు

కుంటలో పడి ఒకరు మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ పంచాయతీలోని అయ్యప్ప నగర్ వద్ద కుంటలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. పశువులను నీరు తాపుకునేందుకు కుంట దగ్గరికి వెళ్లగా అక్కడ నీటిలో ఒక మృతదేహం కనిపించింది. ఈ మేరకు వారు పోలీసులకు సమాచారం తెలిపారు. ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఆధ్వర్యంలో అక్కడికి వెళ్లి పశువుల నీటి కుంటలో ఉన్న మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి సుమారు 30 సంవత్సరాల వయసు ఉంటుందని, గత మూడు రోజుల క్రితం కుంటలో పడి మతి చెందాడని, తలకాయ వరకు ఎలాంటి ఆనవాళ్లు కనిపించకుండా ఎముకలు మాత్రమే కనిపిస్తున్నాయని అన్నారు. మృతి చెందిన వ్యక్తి బిస్కెట్ కలర్ చొక్కా, నేవీ బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నారన్నారు. కుడి చేతి మీద అమ్మా అని పచ్చబొట్టు వేయించుకున్నాడని అన్నారు. అలాగే త్రిశూలం ఢమరుకం సన్నీ అని, ఎడమ చేతి మీద అన్నా చెల్లి అని, దానితో పాటు ఎస్ఆర్ అని కూడా చేతి మీద రాయించుకున్న ఆధారాలు మాత్రమే ఉన్నాయని అన్నారు. మరి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు యువ నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ అంకేపల్లి బంగారుబాబు సహకారంతో నీటిలోని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైశ్యాలకు తరలించినట్లు ఎస్ఐ ఫిరోజా ఫాతిమా తెలిపారు. వీరి వెంట స్థానికులు భాస్కర్, లింగం, సుమన్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పంచాయతీ పరిధిలోని బాబూజీ కాలనీ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామానికి చెందిన కొమ్ము వంశీ సోమవారం టంగుటూరు నుంచి ఒంగోలు వైపు టీవీఎస్ స్కూటీపై వెళ్తుండగా టోల్ ప్లాజా దాటిన తరువాత బాబూజీ కాలనీ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పక్కన డివైడర్‌కు ఢీకొని పక్కకు పడిపోయింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి కింద పడిపోయి తల, శరీరంలోని పలుభాగాలలో తీవ్ర గాయాలై పైకి లేవలేని స్థితిలో చాలాసేపు కిందనే కొట్టుమిట్టాడాడు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఓ పోలీసు కానిస్టేబుల్ క్షతగాత్రుని వద్ద లభించిన ఆధారాలతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యాలకు తరలించారు.

ఈతేరు గ్రామంలో ఘర్షణ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం ఈతేరు గ్రామంలో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సోమవారం గ్రామంలోని రెండు వర్గాల మధ్య గొడవ పెరిగి కొట్లాటకు దారితీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని రెండు వర్గాలు దాడులకు దిగడంతో ఒక వర్గం పోలీసులను ఆశ్రయించారు. దీంతో రూరల్ పోలీసులు గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన గొడవ నేపథ్యంలో ఈ దాడులు జరిగాయని స్థానికుల సమాచారం. గతంలో ఇదే తరహాలో గొడవలు జరిగితే పెద్దల సమక్షంలో రాజీ జరిగింది. తిరిగి ఇలా జరగడం ప్రశాంతంగా ఉండే గ్రామంలో ప్రజలకు ఆందోళనకరంగా మారింది. దీనిపై పోలీసు అధికారులు గ్రామంలో పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో కోవిడ్ కేసులు నమోదు అవుతున్నందున అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 3 కోవిడ్ కేసులు నమోదయ్యాయని, చిన్నపాటి అనుమానం వచ్చినా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కోవిడ్ ఉన్నప్పటికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. వైద్యులను సంప్రదించి అవసరమైన మందులు వాడుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన అర్జీలు గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి శివ జ్యోతి, సిపిఒ భరత్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి ఏ చంద్రశేఖర్‌రెడ్డి, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎస్ఇ విద్యాసాగర్, మత్స్య శాఖ జెడి సురేష్, పశుసంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, వ్యవసాయ శాఖ జెడి అబ్దుల్ సత్తార్, పౌర సరఫరాల శాఖ డిఎస్ఓ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



స్పందనలో ప్రజల సమస్యలపై అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

హమాలీలకు కూలి రేట్లను చెల్లించాలి: సిఐటియు

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజా పంపిణీ వ్యవస్థలో లారీల ద్వారా ఎగుమతి చేసి సరఫరా చేసే హమాలీలకు కూలి రేట్లు వెంటనే చెల్లించాలని కోరుతూ జిల్లా సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. మండల స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు ప్రతి నెలా బియ్యం, పంచదార, కందిపప్పు లారీల ద్వారా సరఫరా చేసే హమాలీలకు ఫిబ్రవరి నెలకు సంబంధించి రేషన్ షాపులకు దించిన కూలి రేట్లు చెల్లించాలని హమాలీల యూనియన్ స్పందనలో సంయుక్త కలెక్టర్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. జనవరి వరకు మండల స్టాక్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు సరఫరా చేసే సరుకుల దింపుడు కూలి డీలర్లు ఇచ్చేవారని, కోర్టు ఆదేశం మేరకు డీలర్లు ఫిబ్రవరి నెలకు చెల్లించలేదని, హమాలీలకు తామే చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించిన క్రమంలో ఇంతవరకు ఫిబ్రవరికి సంబంధించిన దింపుడు కూలిని ప్రభుత్వం చెల్లించలేదని అన్నారు. వెంటనే హమాలీలకు కూలి డబ్బులు చెల్లించాలని కోరుతూ యూనియన్ నాయకులు తమ వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు సిహెచ్ మజుందార్, యూనియన్ జిల్లా అధ్యక్షులు బి రతన్‌బాబు పాల్గొన్నారు.



అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

'స్పందన' అర్జీదారులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-బాపట్ల: స్పందన అర్జీదారులకు బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ అల్పాహారం మంచినీరు పంపిణీ చేశారు. సోమవారం నందిరాజుతోట చెందిన పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు పీటా వేణుగోపాల్ సహకారంతో 225 మందికిపైగా స్పందనకి విచ్చేసిన వారికి రెడ్ క్రాస్ సేవలందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి బిఎస్ నారాయణ భట్టు, రెడ్‌క్రాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందనకు 5 అర్జీలు

ప్రజాశక్తి-రేపల్లె: ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్మించిన స్పందన కార్యక్రమానికి 5అర్జీలు అందాయి. ఆర్డీవో జగన్నాథం పార్థసారథి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లోని ప్రజలు ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ జగన్నాథం పార్థసారథి అన్నారు. స్పందనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

గడువులోపు స్పందన అర్జీల పరిష్కారం: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా: నిర్దిష్ట గడువు లోపు స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల ప్రజలు జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చి తమ సమస్యలను స్వయంగా జిల్లా ఎస్పీ అర్జీల ద్వారా తెలియజేశారు. ఎస్పీ వారి సమస్యలు విని, ఫిర్యాదులను పరిశీ లించి సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. స్పందన ద్వారా వచ్చిన ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ స్పందన కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి జి లక్ష్మయ్య, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ విమాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో అనంత రామకృష్ణ

భవిత కేంద్రం సందర్శన

విద్యార్థులకు స్వీట్లు, పండ్లు, నోటుపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి భవిత కేంద్రాన్ని రిటైర్డ్ ఎల్ఐసి డెవలప్మెంట్ అధికారి కుందుర్తి అనంత రామకృష్ణ కుటుంబ సభ్యులు సోమవారం సందర్శించారు. కేంద్రంలోని ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించారు. ఐఈఆర్టీ కొంగల శ్రీనివాస్ మాట్లాడుతూ వీరు భవిత కేంద్రం అభివృద్ధికి మూలస్తంభం లాంటి వారని, ఇటువంటి విద్యార్థులంటే ఎంతో ఇష్టమని అన్నారు. భవిత కేంద్రం ప్రకాశం జిల్లాలోనే ఒక మోడల్ కేంద్రంగా రూపుదిద్దుకుందంటే ప్రధాన కారణం రామకష్ణ అని, తను సహాయం చేసి ఎంతోమంది దాతలను కలిసి వారి చేత విద్యార్థులకు అవసరమైన సుమారు రూ.5 లక్షల విలువగల పరికరాలను అందించటంలో ప్రముఖపాత్ర పోషించారని పేర్కొన్నారు. ఐఈఆర్టీ పాలపర్తి యోనా మాట్లాడుతూ రామకృష్ణ సేవలు మరువలేనివని, ప్రస్తుతం గుంటూరులో ఉంటూ వ్యిద్యార్థులతో ముచ్చటించాలని ఇక్కడకు వచ్చామని తెలిపారు. అనంతరం ఫిజియోథెరపీ కేంద్రాన్ని సందర్శించి, ప్రతిరోజూ భవిత కేంద్రంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను తల్లిదండ్రులు వినియోగించుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజియో థెరపిస్టు డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, ఆయా లక్ష్మి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మోపిదేవి

జగనన్న ఆసరాతో ఎదగాలి: మోపిదేవి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రతి మహిళ జగనన్న ఆసరాతో ఆర్థిక శక్తిగా ఎదగాలనే లక్ష్యంతో జిల్లాలో మూడో విడత జగనన్న ఆసరా విడుదల చేయడం జరిగిందని బాపట్ల జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రమైన బాపట్ల వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో జరిగిన మూడో విడత జగనన్న ఆసరా విడుదల కార్యక్రమానికి మోపిదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని 6 నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద స్వయం సహాయక సంఘాలకు రూ.238 కోట్ల 31 లక్షలు నగదు విడుదల చేయడం జరిగిందన్నారు. వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా లబ్ధిపొందుతున్న సంఘా మహిళలు ఆ నగదుతో మరింత ఆర్థికాభివద్ధి సాధించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ జగనన్న ఆసరాతో పాటు స్త్రీనిధి.. బ్యాంక్ లింకేజ్ పథకాల ద్వారా పెద్దఎత్తున సబ్సిడీతో కూడిన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జునరావు, బాపట్ల ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, ఏ లక్ష్మణాచారి, డి సురేష్, ఏపిఎంలు జిల్లా స్థాయి డిఆర్డిఏ అధికారులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గ్రూప్ 1 మెయిన్స్ గడువు పెంచాలి

ప్రజాశక్తి-బాపట్ల

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్ 1 మెయిన్స్ గడువు అదనంగా 3 నెలలపాటు పెంచాలని కోరుతూ తెలుగు విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు (టిఎన్ఎస్ఎఫ్) మొవ్వ శరత్ చంద్ర సోమవారం స్పందనలో బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం శరత్ చంద్ర విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తే ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. సీఎం అయ్యాక ఆ మాటే మరిచారు. ఓ వైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కాక, మరోవైపు ప్రయివేట్ ఉద్యోగాలు లేక యువత నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల అనంతరం విడుదల చేసిన గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసి క్వాలిఫై అయిన అభ్యర్థులకు సన్నద్ధం అయ్యే సమయం తక్కువగా ఉండడం వారిని ఆందోళనకు గురి చేస్తోందన్నారు. ప్రిపరేషన్ కోసం 90 రోజుల కంటే తక్కువ సమయం ఇవ్వడం, మెయిన్స్ పరీక్షకు సిద్ధం కావడానికి ఏడు పేపర్లు పూర్తి చేయాల్సి ఉన్నందున టెన్షన్ పడుతున్నారని తెలిపారు. మెయిన్స్ ప్రిపరేషన్‌కి ఇచ్చిన గడువుకు అదనంగా మరో 90 రోజుల సమయం కేటాయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాపట్ల జిల్లా టిఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి యెనుముల రాంబాబు, బాపట్ల జిల్లా సెక్రటరీ పరిశా గోపి, వేమూరు నియోజకవర్గ ఉపాధ్యక్షులు బోరుగడ్డ ఆనంద్, కార్యదర్శి రత్నపాల్, ఉడత దేవేందర్ బాలాజీ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

అధికారంలోకి వస్తే అభివృద్ధి చేస్తా: వేగేశన

ప్రజాశక్తి-కర్లపాలెం

ప్రతి ఇంటికీ తెలుగుదేశం పార్టీని చేరువ చేయడమే లక్ష్యమని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. కర్లపాలెం మండలం పేరలి గ్రామంలోని మల్లెల వారిపాలెంలో ఇంటింటికీ తెలుగుదేశం, మీ మాట-నా బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ విధానాలను వివరిస్తూ చీర, చేతి సంచి, కరపత్రాన్ని అందజేశారు. ముందుగా పెరలి గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, తదనంతరం గ్రామస్తులు పూలతో, బాణసంచాలతో ఘన స్వాగతం పలుకగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కోలాహలంగా సాగిన భారీ ర్యాలీగా వెళ్లి కార్యక్రమం ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను కూడా ఒక సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి నేడు 3,000 మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నాను. నా కృషిని గుర్తించి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు ఇచ్చిన తరువాత అందరినీ కలుపుకుని కార్యక్రమాలు చేపడుతూ రాబోయే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నానని పేర్కొన్నారు. ప్రతి ఇంటికీ తెలుగుదేశం పార్టీని చేరువ చేస్తూ ఒక అన్నగా, తమ్ముడిగా ఆడపడుచులకు చిరు కానుకను అందిస్తూ ముందుకు సాగుతున్నా. నన్ను మీ కుటుంబ సభ్యుడిలా భావించి అవకాశం ఇవ్వండి కలిసి బాపట్లను అభివృద్ధి చేసుకొందామని అన్నారు. పెరలి గ్రామం అంటే తెలుగుదేశం అడ్డాగా చేసుకునేలా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా దళితులకు చాలా అన్యాయం జరిగింది. వారికి రావాల్సిన చాలా సంక్షేమ పథకాలు నిలిపివేశారన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే పెరలి గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి అండగా నిలుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఏపూరి భూపతిరావు, పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల వెంకటస్వామి, మాజీ ఎంపిటీసీ షేక్ బాజీ, వసంతరెడ్డి, బొద్దుకూరి విజయ, కట్ట సుజాత, మద్దిబోయిన బుల్లయ్య, మండల టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, ఉద్యోగ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి లక్షలాది మంది తరలి రావాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు, కనీస పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. నాలుగు లేబర్ కోర్లు రద్దు చేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ,టైం స్కేల్, స్కీం వర్కర్లు ,డైలీ వేజ్ ,కంటింజెంట్ ఉద్యోగుల, కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. ,సిపిఎస్ రద్దు ఒపిఎస్ పునరుద్ధరించాలనా్రు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర గ్యారెంటీ చట్టం అమలు చేయాలన్నారు. కేరళ తరహాలో రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. విద్యుత్తు సవరణ బిల్లు 2022ను రద్దు చేయాలన్నారు. ఎరువులపై సబ్సిడీ పెంచి రైతుల ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు పెంచాలన్నారు. ఉపాధి కూలీలకు రెండు వందల రోజుల పని దినాలు కల్పించి రోజు వేతనం రూ.600 తగ్గకుండా ఇవ్వాలన్నారు.కౌలు రైతులను గుర్తించి భరోసా, పరిహారాలు ఇవ్వాలన్నారు. నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు మూడు బడ్జెట్ రూ.3లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటుకరణను నిలుపుదల చేయాలన్నారు. మోనిటైజేషన్ పైపులైన్ రద్దు చేయాలన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్, గురునాథం రాములు, కత్తి మోషే, కత్తి మత్తయ్య, మౌలాలి, గాలిమోటు ఏసోబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. **పామూరు** :కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి కోరారు. పామూరు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కార్మికులను యాజమానులకు బానిసలు మార్చే కార్మిక చట్టాలను మార్పు చేసి లేబర్ కోడ్‌లు మార్చే ప్రయత్నాలను విరమించు కోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్. పిచ్చి రెడ్డి ,రాజ్యం, సుబ్బారావు ,షేక్ అల్లాభక్షు, షేక్ ఖాదర్బాషా ,మహాదేవయ్య పాల్గొన్నారు. **మార్కాపురం :** కూలీలు, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న ఛలో ఢిల్లీ కార్యక్రమం తలపెట్టినట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మార్కాపురం మండల నాయకుడు జమ్ముల నాగరాజు తెలిపారు. మండలంలోని రాయవరం గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సోమవారం మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలో ఢిల్లీ కార్యక్రమంలో కూలీలు, కర్షకులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. **మద్దిపాడు :** చలో ఢిల్లీ కార్యక్రమం జయ ప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు పిలుపు నిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కనపర్తి సుబ్బారావు, చిన్న సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


హనుమంతునిపాడులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


మార్కాపురంలో కూలీలతో మాట్లాడుతున్న నాగరాజు


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి నారాయణ

పోలవరం ప్రాజెక్టు

ఎత్తు తగ్గింపు ఆలోచనను విరమించుకోవాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్

- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు ఆలోచనను విరమించు కోవాలని సిపిఐ జిల్లా కార్యద్శి ఎంఎల్. నారాయణ డిమాండ్ చేశారు. ఈ విషయమై రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అడ్డుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ సిపిఐ రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టు గా విభజన చట్టంలో పొందు పరచిందన్నారు. ప్రాజెక్టు ఎత్తు 150 అడుగులను 135 అడుగులకు తగ్గించి 196 టిఎంసిల నీటి నిల్వల సామ ర్థ్యం నుంచి 92 టిఎంసిలకు తగ్గించాలని పార్లమెంట్‌లో ప్రకటించి ందన్నారు. ఇదే జరిగితే విద్యుత్ ఉత్పత్తి కి అవరోధం ఏర్పడటమే గాక నీటి నిల్వలు సామర్థ్యం తగ్గిపోయి ప్రకాశం, రాయలు సీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా రూపొందించి ఎత్తు, నీటి నిల్వలు సామర్థ్యం యథాతథంగా ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం చేస్తుంటే ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి అడ్డుపడక పోవడాన్ని సిపిఐ తీవ్ర అభ్యంతరం తెలియజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో డిఆర్‌ఒను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, పివిఆర్.చాదరి, జిల్లా నాయకులు పి. ప్రభాకర్, ఎం. రమేష్ బాబు, జిపి. రామారావు, ఆర్. రామకష్ణ, నల్లూరి మురళి, ఎం.విజయ,పి.గోపి, ముత్తని అంజయ్య, ఆర్.కరుణానిది, కొత్తకోట వెంకటేశ్వర్లు, యు. ప్రకాశరావు, జి.బాలకోటయ్య, లక్ష్మి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తుల విక్రయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల


గిరిజన సహజ ఉత్పత్తులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిసిసి మేనేజర్ పుల్లారావు తెలిపారు. పెద్ద దోర్నాల పట్టణంలో ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు సౌజన్యంతో గిరిజన సహజ ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులు మంచి నాణ్యతను కలిగి సహజ సిద్ధంగా ఉంటాయని తెలిపారు. ధరలు కూడా సామాన్య ప్రజలకు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మేనేజర్ రాములు నాయక్, తహశీల్దారు వేణుగోపాల్, ఇండియన్ ఆయిల్ డీలర్ అంబటి వీరారెడ్డి తదితతరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రభుత్వ సంక్షేమ పథ కాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. చీమకుర్తి మండలం బూదవాడ పంచాయతీ పరిధిలోని మర్రిచెట్ల పాలెంలో సోమ వారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకాయమ్మ ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచి జంగ్రాజుపల్లి మరియమ్మ, రావులపల్లి కోటేశ్వరరావు, జె. యాకోబు, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు. **కురిచేడు :** పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. కురిచేడులోని ఎస్‌సి,ఎస్‌టి కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెల్లం చంద్రశేఖర్, మేరువ సుబ్బారెడ్డి, మేరువ పిచ్చిరెడ్డి, బి.వెంకట నరసయ్య, అయినాబత్తిన సబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న వెంకాయమ్మ

కమిషనర్ స్పందనకు 10 అర్జీలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై నగర ప్రజల 10 అర్జీలు అందజేశారు. అందులో టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌కు సంబంధించి 4, శానిటేషన్‌కు సంబంధించి 2, రెవెన్యూ సెక్షన్‌కు సంబంధించి 2, ఇంజినీరింగ్ సెక్షన్‌కు సంబంధించి 2 అర్జీలు ఉన్నాయి. అర్జీలను స్వీకరించిన కమిషనర్ నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలని సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు తమ సమస్యలను స్పందనలో తెలియజేసి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీర్ కె.మాల్యాద్రి, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, వివిధ సెక్షన్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-చీమకుర్తి

చండీఘడ్‌లో ఏప్రిల్ 27 నుంచి మే1 వరకూ నిర్వహిస్తున్న జాతీయస్థాయి ఆటల పోటీలకు స్థానిక నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 22 నుంచి తెనాలి తాలూక చిలుమూరులో రాష్ట్రస్థాయిలో డాడ్జ్‌బాల్ పోటీలల్లో బాలబాలికల విభాగాలలో ఎంపికలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు బాలాజీరాజు, సౌమ్య, సువర్చలాదేవి, లహరి, మహిత, రేఖా తనూజ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, ఉపాధ్యాయుడు సుబ్బారావు అభినందించారు.

విద్యార్థులకు అవగాహన

సంతనూతలపాడు రూరల్ : పదవ తరగతి చదివే సమయంలోనే విద్యార్థులు తమ కెరీర్‌ను ఎంచుకోవాలని స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ తెలిపారు. మండల పరిధిలోని పేర్నమిట్ట జడ్‌పి హైస్కూల్‌లో ఏపీ డెవలప్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ ప్రోగ్రాం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ లోకనాథ్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగామన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ప్రమోద,స్టెప్‌ఫీల్డ్ ఆఫీసర్ మాధవాచారి, పాఠశాల కెరీర్ గైడెన్స్ ఉపాధ్యాయుడు ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిరుమలశెట్టి శ్రీను

ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి- సంతనూతలపాడు రూరల్

గిరిజన సంక్షేమం, ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని టిడిపి బాపట్ల పార్లమెంట్ ఎస్‌సి సెల్ అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీను డిమాండ్ చేశారు. తహశీల్దారు శ్రీనివాసరావును సోమవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారం లోకి వచ్చిన తర్వాత గిరిజన కార్పొరేషన్ , గిరిజన సహకార సంస్థ ఐటిడిఎ సంస్థలను నిర్వీర్యం చేశాడన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ కార్యదర్శి వి.గోవిందయ్య , నాగులుప్పలపాడు మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు జాన్సన్, ఎస్‌టి సెల్ మండల అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు, ఐటిడిపి ప్రధాన కార్యదర్శి సాదు కొండలరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ముండ్లమూరు

మహిళల ఆర్థికాభివృద్ధే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. అందులో భాగంగా మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముండ్లమూరు, దర్శి, తాళ్లూరు మండలాలకు చెందిన డ్వాక్రా మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేణుగోపాల్ మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందేందుకు చేయూత, అమ్మఒడి ,వైఎస్ఆర్ ఆసరా లాంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. దర్శి నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు ఉండగా నాలుగు మండలాల్లో మహిళలు ఎంపిపిలుగా ఉన్నట్లు తెలిపారు. మూడు మండలాలకు సంబంధించి రూ.27 కోట్ల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు ,అధికారులు పాల్గొన్నారు. **మార్కాపురం :** మహిళా సాధికారత కోసం సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తోడ్పాటును అందిస్తున్నారని, దాన్ని సద్వినియోగం చేసుకుంటే మహిళలు ఆర్థిక ప్రగతిలో రాణించాలని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా లబ్దిదారుల ఖాతాల్లో నగదు జమ కావడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మంజూరైన నిధులను రూ. 7,970,7387 చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మ శ్రీనివాస్, పట్టణ మెప్మా అధ్యక్షురాలు దొడ్డా భాగ్యలక్ష్మి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మెప్మా సిబ్బంది, పొదుపు మహిళలు పాల్గొన్నారు. **దర్శి :** దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు మండలాల పరిధిలోని డ్వాక్రా మహిళలకు రూ. 24,17,00,000 వైఎస్ఆర్ ఆసరా చెక్కులను ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ అందజేశారు. అనంతరం 29న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ సీడాప్ మరియు జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో ఎపిఎం విజయ, ముండ్లమూరు ఎంపిపి సునీత బ్రహ్మానందరెడ్డి, తాళ్లూరు జడ్‌పిటిసి మారం వెంకటరెడ్డి, నాయకులు కుమ్మిత అంజిరెడ్డి, సానికొమ్ము తిరుపతిరెడ్డి, డగ్లస్, డ్వాక్రా మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్


మార్కాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

'ఆసరా' విడుదల : ఎపిఎం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల



మండల పరిధిలోని స్వయం సహాయక సంఘాలకు ఈనెల 25న మూడో విడత జగనన్న ఆసరా విడుదల చేసినట్లు ఎపిఎం పోలయ్య తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ కెపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘాల అభివద్ధి ఆసరా రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. మండల పరిధిలోని మొత్తం 573 గ్రూపుల్లోని 5,649 మంది సభ్యులకు రూ. 3,10,4,914 మంజూరు చేసినట్లు ఆయన పోలయ్య తెలియజేశారు. ఈ నెల 31న యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలోని డ్వాక్రా గ్రూపు సభ్యులకు పురపాలక మరియు పట్టణాభివద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ చేతుల మీదుగా అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అందుబాటులోకి 'ఫైబర్' సిలిండర్లు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

10 కిలోల బరువైన ఫైబర్ సిలిండర్లను పిఎల్‌పి ఇండియన్ గ్యాస్ కంపెనీ వద్ద ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ దుగ్గినేని భాస్కర్ చేతుల మీదుగా వినియోగదారులకు సోమవారం అందజేశారు. చేశారు. ఈ సందర్భంగా దుగ్గినేని భాస్కర్ మాట్లాడుతూ నూతన ఫైబర్ సిలిండర్లలో లోపల ఎంత గ్యాస్ ఉన్నది తెలిసే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో భారతదేశం అంతటా కూడా ఫైబర్ సిలిండర్లు వినియోగంలోకి రానున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా ప్రకాశం జిల్లాలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఫైబర్ సిలిండర్లను ప్రజలకు అందుబాటులో తెచ్చినందుకు తాను గర్వపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పిఎల్‌పి.యాదవ్, నాగం రామకష్ణ, మేనేజర్లు శివ, ఆసియా, కస్టమర్లు సుబ్రమణ్యం, ప్రశాంత్ పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న హర్ష పీత్రమ్

ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్‌గా హర్ష ప్రీతమ్ నియామకం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ గా డాక్టర్ మండే నియమిస్తూ రిజిస్టర్ ప్రొఫెసర్ హరిబాబు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఎన్ఎస్ఎస్ డిస్టిక్ కోఆర్డినేటర్‌గా, డిస్టిక్ ఎన్ఎస్ఎస్ నోడల్ ఆఫీసర్‌గా హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పని చేశారు. బెంగళూరులో నిర్వహించిన నేషనల్ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం, వైజాగ్ గీతం యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూత్ బెస్ట్ ప్రోగ్రాం, హైదరాబాద్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో టిఆర్‌డి ప్రోగ్రాంలోనూ ప్రకాశం జిల్లా రెడ్ క్రాస్ 100 సంవత్సరాల ప్రోగ్రాంలో అప్పటి కలెక్టర్ పోలా భాస్కర్ నుంచి ఆయన ప్రశంసా పత్రాలు అందుకున్నారు. మూడుసార్లు అవార్డు తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్ష ప్రీతమ్‌దేవ్ కుమార్‌ను ఆంధ్ర కేసర విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి, రిజిస్ట్రార్ హరిబాబు అభినందించారు

బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-పొదిలి


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న నాయకులు

మండల పరిధిలోని నరాదనగుంట, కుంచేపల్లి ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం పిడుగు పడటంతో 38 గొర్రెలు మృతిచెందిన సంగతి తెలిసిందే. ఎపి గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం, ప్రజా సంఘాల నాయకులు సోమవారం గ్రామానికి బాధితులను పరా మర్శించారు. ఈ సందర్భంగా ఏపీ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ గొర్రెల పెంపకందారులంతా పేదలని తెలిపారు. గొర్రెల పెంపకమే వారి ప్రధాన వృత్తి అని తెలిపారు. అప్పులు చేసి అధిక వడ్డీలకు తెచ్చి గొర్రెల కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. పిడుగు పాటుకు గొర్రెలు మృతిచెందడంతో వారు తీవ్రంగా నష్టపోయినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో మృతిచెందిన ఒక్కొక్క జీవానికి రూ.15 వేల వంతున నష్టపరిహారం అందించి బాధితులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి పి.రమేష్ ప్రజాసంఘాల నాయకులు నర్రా వెంకటేశ్వర రెడ్డి, కొండలరావు, బాధితులు కాకర్ల ఆంజనేయులు, రెడ్డి బోయిన చిన్న సుబ్బయ్య, మర్రి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-జరుగుమల్లి


సామాజిక తనిఖీ ప్రజావేదికలో డ్వామా పీడీ, అధికారులు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని 20 గ్రామ పంచాయతీల్లో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ ఉపాధి హామీ పథకం చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డ్వామా పీడీ కె.శీనారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా 200 పనులకు సంబంధించిన రూ.7 కోట్ల వివరాలను వివరాలను వెల్లడించారు. మేట్ల హాజరు పట్టికలో కూలీల నమోదు వివరాలు, నిర్ణయించిన పనుల కొలతలకు వివరాలను పరిశీలించారు. ఎన్ఐసిలో చేసి రద్దు చేసిన 450 పనుల గురించి అధికారులు ప్రశ్నించారు. రోడ్ల వెంట నాటిన మెక్కల వివరాలు అడిగి తెలుసుకొని తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రీసోర్సు పర్సన్ వెంకయ్య, అంబుడ్స్‌మెన్ మీరావళి, పంచాయతీ రాజ్ ఎఇ కోటా శ్రీహరి, ఎంపిడిఒ పి.రామకృష్ణ, ఎఫ్ఎలు, టిఎలు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకూ నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డ్యామా పీడీ శీనారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ, ఎంపిడిఒ బివివి.కుమారి, డిఆర్‌పిలు కమల నాథ్, ఎసయ్య, ఎస్ఆర్‌పి వెంకయ్య, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, ఎపిఒ ధనుంజయవర్మ, రవి, జోత్స్న, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రస్థాయి పాల్గొన్నారు.

రజక వృత్తిదారులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ఎపి రజక చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ తిరుపతయ్య

ప్రజాశక్తి-మార్కాపురం




మాట్లాడుతున్న తిరుపతయ్య

రజక వృత్తిదారులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని ఎపి రజక చైతన్య వేదిక రాష్ట్ర కన్వీనర్ పోలిశెట్టి తిరుపతయ్య డిమాండ్ చేశారు. గత 40 సంత్సరాలుగా రజక వృత్తి దారులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కోరుతున్నా పట్టించు కోవడం లేదన్నారు. పాలకులు మారినా ఫలితం ఉండటం లేదని తెలిపారు. రజక వృత్తిదారులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కోరుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రజక సంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సంద ర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ఏపీలో రజకుల సమస్యల పట్ల జగన్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. సిఎం జగన్ నాలుగు బడ్జెట్లు పెడితే ఫెడరేషన్ స్థానంలో తెచ్చిన కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వలేదన్నారు. ఈ ధర్నాలో టిడిపి ఎంపీలు కింజారపు రామ్మోహన్ నాయుడు, కనకమేడల పాల్గొని సంఘీభావం తెలిపారు.

'కందుల' పాదయాత్రకు స్వాగతం

ప్రజాశక్తి-కొనకనమిట్ల


పాదయాత్రలో కందుల నారాయణరెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్కా పురం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర మండల పరిధిలోని అంబాపురం, బోడపాడు, వాగుమడుగు, బురదపాలెం, చింతగుంట, బసవాపురం, మునగపాడు గ్రామాల్లో రెండోరోజూ సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు కందులకు స్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా టిడిపి యర్రగొండపాలెం నియోజక వర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కందుల నారాయణ రెడ్డి మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయంలో ప్రజలను నిలువునా దగా చేసిన వైసిపిని చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపిస్తే వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. మార్కాపురం జిల్లాను సాధిస్తానని తెలిపారు. గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ కందుల నారాయణరెడ్డి గతంలో పాదయాత్ర చేపట్టి వెలిగొండ ప్రాజెక్టు రెండవ టన్నెల్ సాధించినట్లు తెలిపారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు అయితే రైతుల భూముల విలువ పెరుగుతాయని తెలిపారు. ప్రజలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సినపని ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రభాకరరావుపై చర్యలు తీసుకోండి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన జడ్పిటిసి బండ్ల తిరుమలాదేవి

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక బండ్ల ఆదెమ్మ మెమోరియల్ ప్రాథమిక వైద్యశాల డాక్టర్ ప్రభాకర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని మండల జడ్పిటిసి బండ్ల తిరుమలాదేవి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమానికి వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తిరుమలాదేవి కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌తో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం మూడున్నర వరకు ప్రాథమిక వైద్యశాల ఆఫీసులోనే తోటి ఆఫీసు సిబ్బందితో మద్యం సేవించడాన్ని సిబ్బంది, స్థానికులు గమనించి పోలీసుకు చరవాణి ద్వారా తెలియపరిచారన్నారు. సంబంధిత పోలీసు వారు వచ్చి పరిశీలించగా వారిని బ్రతిమలాడుకుని సర్దుబాటు చేసుకున్నారన్నారు. డాక్టర్ ప్రభాకర్ యూడిసి శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ నుంచి సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ పొందిన పిచ్చయ్య కలిసి హాస్పటల్ ఆఫీస్ రూమ్‌లోనే మద్యం సేవించి నానా రభస చేస్తూ, గోలగోల చేస్తుండగా స్థానికులు, హాస్పటల్ సిబ్బంది గమనించి ప్రశ్నించగా వారిని నానా బూతులు తిడుతూ మద్యం మత్తులో చొక్కా కూడా లేకుండా హాస్పిటల్ నుంచి బయటకు వచ్చారు. వైద్యం సరిగా చేయడం లేదని, పేషెంట్స్ ఫ్రెండ్లీగా ఉండటం లేదని జనవరి నెలలో ప్రకాశం జిల్లాలో జడ్పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న జడ్పిటిసి బండ్ల తిరుమలాదేవి

అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో డిఎంహెచ్ఒ విజయమ్మకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ప్రతిరోజూ డాక్టర్ హాస్పటల్‌కు ఆలస్యంగా రావడం, ఆల్కహాల్ తీసుకొని అసభ్యకరమైన మాటలు మాట్లాడుతూ సిబ్బందిని, వైద్యం కోసం వచ్చిన పేషెంట్లను ఇష్టానుసారం మాట్లాడుతూ బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. వైద్యం కోసం వచ్చిన పేషెంట్స్‌ను ఎక్కువసేపు వేచిఉండేలా చేయటం, వైద్యం చేయాల్సిన సమయంలో ఫోన్ మాట్లాడుకుంటూ కాలక్షేపం చేయడం, హాస్పిటల్ అటెండెన్స్ పద్ధతి ప్రకారం వాడకపోవడం, ఎఫ్ఆర్ఎస్ అటెండర్స్‌కు సంబంధించిన యాప్ లొకేషన్‌లో ఉండకుండా మిస్ బిహేవ్ చేయటం, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు ద్వారా పర్సనల్ పాస్వర్డ్ ఏర్పాటు చేసుకొని తన వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడం, హాస్పటల్ సిబ్బంది అయిన ఎంఎల్‌హెచ్‌పిఎస్, ఏఎన్‌పిఎస్ వైద్యం కోసం వచ్చిన పేషెంట్లను కులము, గోత్రము అడిగి మరీ వైద్యం చేయడం, నానా రకాల బూతు మాటలు మాట్లాడుతూ ఉండటం, వైద్యం సరిగ్గా అందించకపోవడం తదితర అంశాలపై గతంలో స్పందన ద్వారా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సిబ్బందికి తనకు నచ్చిన వారికి సెలవు ఇచ్చి, నచ్చని వారిని ఇబ్బందులు గురిచేస్తుంటారన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా నిరుపేదలైన బడుగు బలహీన వర్గాల చెందినవారు జీవిస్తుంటారని, అత్యవసర సమయంలో డాక్టర్ సరిగా విధులకు హాజరు కాకపోవడం వల్ల వైద్యం నిమిత్తం పందిళ్లపల్లి, చీరాల వెళుతుంటారన్నారు. గత రెండు పర్యాయాలు తాను మండల పరిషత్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు హాస్పటల్‌కి ఛైర్మన్‌గా కొనసాగానని, ఆ సమయంలో సుమారు ప్రతిరోజు 130 నుంచి 150 వరకు ఓపీలు నడిచేవని, ప్రస్తుతం కేవలం 10 నుంచి 20 మాత్రమే ఓపి నడుస్తున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి డాక్టర్, సిబ్బందిపై వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకొని వారిని శిక్షించాలని ప్రకాశం జిల్లా కలెక్టర్‌ని వేటపాలెం జడ్పిటిసి బండ్ల తిరుమలాదేవి కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో రామన్నపేట మూడో వార్డు మెంబర్ బులసల రామలక్ష్మి, బండ్ల బాబు, పర్వతరెడ్డి, రేణుక పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాం: బాచిన

ప్రజాశక్తి-పంగులూరు: దేశం మొత్తంలో ఎన్నికల హామీను 99 శాతం అమలు చేసిన నాయకుడు, మొట్టమొదటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని అద్దంకి వైసిపి ఇన్చార్జ్, ఆంధ్రప్రదేశ్ శాప్ నెట్ ఛైర్మన్ బాచిన కష్ణ చైతన్య అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పంగులూరు హై స్కూల్ లో జరిగిన మూడో విడత వైయస్సార్ ఆసరా పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఎన్నికలలో డ్వాక్రా రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి, అధికారం రాగానే మర్చిపోయారని గత ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. మూడో విడత వైయస్సార్ ఆసరా పథకం ద్వారా మండలానికి ఏడు కోట్ల రూపాయలు, 900 డ్వాక్రా మహిళలు లబ్ధి పొందాలని తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య మాట్లాడుతూ మహిళలు బాగుంటే రాష్ట్రం బాగుంటుందని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్న జగన్ మరోసారి గెలిపించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోతే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుందని ఆరోజు చెప్పారని, ఈరోజు దేశంలోనే ప్రధాన నగరాలతో పోటీపడుతూ అభివృద్ధి దిశగా దూసుకు పోతుందని, ఇది ఎలా సాధ్యమైంది? అని ప్రజలందరూ ఒకసారి ఆలోచించుకోండి అని కోరారు. పురుషులతో సమానంగా మహిళలు అబివృద్ధి చెందాలని మండల వైసీపీ కన్వీనర్ యర్రం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రాయిణి ప్రమీల, ఎంపీపీ తేళ్ల నాగమ్మ, ఎంపీటీసీ రాములు, మండల అభివద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిని వెంకటసుబ్బారావు, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాసిం, ఏపిఎం జ్యోతి ప్రసాద్, సిసి దాసు, సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



ఆసరా చెక్కు నమూనాను డ్వాక్రా మహిళలకు అందిస్తున్న బాచిన కృష్ణ చైతన్య

స్కిల్ డెవలప్మెంట్ స్కామ్‌లో శిక్ష తప్పదు: ఆమంచి

ప్రజాశక్తి-కారంచేడు

ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్కామ్‌లో చంద్రబాబు నాయుడు శిక్ష అనుభవించక తప్పదని పర్చూరు వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ జోస్యం చెప్పారు. ఇందులో ఆయన పాత్ర కూలంకషంగా కనబడుతోందని ఆరోపించారు. బాపట్ల జిల్లా, కారంచేడులో సోమవారం నాడు జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పందం ప్రకారం జర్మనీకి చెందిన బహుళ జాతి కంపెనీ సీమెన్స్ కంపెనీ తన 90 శాతం వాటాను విడుదల చేయకముందే, రాష్ట్ర ప్రభుత్వం తన 10 శాతం వాటా 371 కోట్లను విడుదల చేయడమేంటని ప్రశ్నించారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి వల్లే అధికారులు నిధులను విడుదల చేశారని ఆయన గట్టిగా చెప్పారు. విదేశాల్లో ఉన్న షెల్ కంపెనీల ద్వార ఆడబ్బు తిరిగి చంద్రబాబు నాయుడు బినామీ జేబుల్లోకే చేరిందని తీవ్రంగా విమర్శించారు. అసలు సీమెన్స్ కంపెనీతో చంద్రబాబు ఒప్పందం చేసుకోలేదని, అందులో పనిచేసే ఉద్యోగులతో ఒప్పందం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ఇది రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద స్కామ్‌గా ఆయన అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన 371 కోట్లకు జిఎస్టీ చెల్లించకపోవడంతో ఈస్కామ్ వెలుగులోకి వచ్చిందన్నారు. సీఐడి, ఐటి, ఈడి సంస్థలు రంగంలోకి దిగి కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. ఇలాంటి దోపిడీలకు పాల్పడే చంద్రబాబు నాయుడు కోర్టుల నుంచి తప్పించుకోలేడని, ఆయనకు శిక్ష తప్పదని అన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కారంచేడు

బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణ గ్రామంలో జరిగిన ఆసరా పథకం వారోత్సవాల్లో భాగంగా సోమవారం పర్చూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డ్వాక్రా మహిళా సంఘాలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పొదుపు సంఘాల మహిళలు వరుసగా మూడో ఏడాది వైఎస్ఆర్ ఆసరా పథకం కింద రూ.7.64 కోట్ల మేరకు లబ్ధి పొందారని తెలిపారు. చిరు వ్యాపారాలు చేసుకుంటూ అందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. డ్వాక్రా మహిళలు 2019 మార్చి వరకు వివిధ బ్యాంకులకు ఉన్న రుణాన్ని మాఫీ చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారని తెలిపారు. పసుపు కుంకుమ పేరుతో చంద్రబాబు డ్వాక్రా మహిళలను మోసం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ జక్కిరెడ్డి సుబ్బాయమ్మ, ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జడ్పిటిసి యార్లగడ్డ రజిని శ్రీనివాసరావు, మండల పార్టీ నాయకులు దండ చౌదరి బాబు, మండల కో ఆప్షన్ సభ్యులుముల్లా నూర్ అహ్మద్, వైస్ ఎంపీపీ వనజ, పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జువ్వ శివరాం ప్రసాద్, డ్వాక్రా మహిళలు, పార్టీ నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

ప్రజాశక్తి-పిట్టలవాని పాలెం

పశువులకు గాలికుంటు టీకాలు తప్పకుండా వేయించాలని మంతెన వారిపాలెం పశు వైద్యాధికారి కాటూరి తిరుమల తేజ అన్నారు. సోమవారం మంతెన వారిపాలెం గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశువులకు గాలికుంటు వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. దీని వలన పశువులలో పాల సామర్థ్యం తగ్గుతుందని అన్నారు. సూడి కట్టటం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. ఎద్దులకు అయితే బండి లాగే సామర్థ్యం పూర్తిగా తగ్గుతుందని అన్నారు. పశువులకు ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్తగా గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నాం అన్నారు. ఈ టీకాలు ప్రతి ఒక్క పశువుకి ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. నాలుగు నెలల దూడలకు కూడా టీకాలు వేయొచ్చని అన్నారు. ఈ కార్యక్రమం మార్చి 24వ తేదీ నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు జరుగుతుందని అన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువులు వ్యాధి బారిన పడకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటపతి రాజు, సుబ్బారావు, రైతులు పాల్గొన్నారు.



పశువులకు వైద్య అందిస్తున్న డాక్టర్లు



అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ సతీమణి కె లక్ష్మికి అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును అందజేసిన బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎప్పుడు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గత ఏడాది అక్టోబరు 25న అనారోగ్యంతో మరణించిన ఏఎస్ఐ కె బ్రహ్మయ్యకు సంబంధించిన రూ.1 లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్కును ఆయన సతీమణి లక్ష్మికి సోమవారం బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ అందజేశారు. జిల్లా ఎస్పీ మరణించిన బ్రహ్మయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి అందవలసిన ఇతర అన్ని బెనిఫిట్లను త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీపీఓ బి సెక్షన్ సూపరింటెండెంట్ కె రాధిక, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం

ప్రజాశక్తి-రేపల్లె: ఏబిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రేపల్లె తెలుగు విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం సోమవారం జరిగింది. ముఖ్య వక్తగా రచయిత, డ్రామా ఆర్టిస్టు, సహజకవి డాక్టర్ మల్లేశ్వరరావు 'తెలుగు సాహిత్యం రచనా విధానం మరియు లలిత కళలు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టిసి రవి చంద్రకుమార్ విద్యార్థులలో సామాజిక స్పృహ, విలువలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందాలంటే ఉత్తమ సాహిత్య పఠనం అవసరత, గ్రంథాలయ ప్రయోజనాన్ని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ శైలజ ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఏసుపాదం, అధ్యాపకులు శామ్యూల్, కోటేశ్వరరావు, తెలుగు అధ్యాపకులు ఎం భీమయ్య పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-పర్చూరు: కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనటంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పర్చూరు-ఇంకొల్లు రోడ్డులో సోమవారం చోటు చేసుకుంది. గుంటూరు సంగడిగుంటకు చెందిన అంకమ్మరావు ద్విచక్ర వాహనంపై ఇంకొల్లు నుంచి పర్చూరుకు వస్తున్నాడు. అదే సమయంలో జాగర్లమూడి రోడ్డు మలుపువైపు వెళుతున్న కారు ప్రమాదవశాత్తు బైకును ఢీకొనటంతో అంకమ్మరావు తలకు తీవ్ర గాయమైంది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు దారుణం

ప్రజాశక్తి-పర్చూరు: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయటం రాజకీయ కుట్రలో భాగమేనని పిసిసి సభ్యుడు తోట శివనాగేశ్వరరావు అన్నారు. రాహుల్‌గాంధీని ఎన్నికలలో పోటీ చేయటానికి వీలు లేకుండా వ్యూహాత్మక ఎత్తుగడ వేశారని ఒక ప్రకటనలో ఆరోపించారు.

గుంటూరు ఛానల్‌కు గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి-పర్చూరు: గుంటూరు ఛానల్‌కు సంబంధించి అన్ని అవరోధాలను తరలించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.145 కోట్లు విడుదల చేస్తున్నట్లు వైసీపీ పర్చూరు ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ తెలిపారు. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గ పరిధిలో ఇనగల్లులో 11.17 ఎకరాలు, గన్నెపూడిలో 21.40 ఎకరాలు, ఏదుబాడులో 16.62 ఎకరాలు మొత్తం 49.20 ఎకరాలు భూ ప్రకటనకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాధర్నాను జయప్రదం చేయండి

చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బిజెపి ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ఏప్రిల్ 5న ఢిల్లీలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం అధ్వర్యంలో జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని పలువురు నేతలు కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో సోమవారం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్, సిఐటియు నాయకులు పి.కల్పన, జివి.కొండారెడ్డి, పి.ఆంజనేయులు, రంగారావు, అవులయ్య, రాఘవమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నెరుసల వెంకటేశ్వర్లు, కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, కెజి మస్తాన్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రికి

వైసిపి రంగులు ఎలా వేస్తారు.?

టిడిపి నియోజకవర్గ బాధ్యులు నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రికి వైసీపీ రంగులు ఎలా వేస్తారని టిడిపి బాపట్ల నియోజకవర్గ బాధ్యులు వి.నరేంద్రవర్మ ప్రశ్నించారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి నరేంద్రవర్మ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ప్రజల సొమ్ముతో ప్రజల కోసం నడుపుతున్న ఆసుపత్రికి ఒక పార్టీకి సంబంధించిన రంగులను ఎలా పరిమితం చేస్తారని ఆసుపత్రి వైద్యాధికారులను నిలదీశారు. ప్రభుత్వ ఆసుపత్రిని వైసిపి ప్రచారం కోసం, ఆర్భాటాల కోసం.. పార్టీ రంగులు వేస్తారా? అని ప్రశ్నించారు. గతంలో ప్రభుత్వ కార్యాలయాలకు వైసీపీ రంగులు వేస్తే కోర్టు మొట్టికాయలు వేసిన సంగతిని నరేంద్రవర్మ గుర్తు చేశారు. పేరుకే జిల్లా కేంద్రంలో పెద్దాసుపత్రి అని, అందులో రోగులకు కనీస సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్న విషయం శాసనసభ్యులకు కనిపించడం లేదా? అని



ఆసుపత్రిని పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

ఆయన విమర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వైసీపీ పార్టీ రంగులు తీసేసే వరకు తెలుగుదేశం పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేకంగా అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపీ మానం విజేత, పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కళారంగం ఎప్పుడూ సమాజ హితం కోరుకుంటుందని, అటువంటి కళారంగం ఆదరణ కోల్పోతోందని పలువురు కళాకారులు, కవులు అన్నారు. ప్రకాశం జిల్లా పౌరాణిక రంగస్థలం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థలం దినోత్సవాన్ని నిర్వహించారు. ఒంగోలు సీవీన్ రీడింగ్ రూమ్ ఆవరణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముందు నటరాజు విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమానికి అధ్యక్షులు వాకా సంజీవరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి మిడసల మల్లికార్జునరావు, కనమాల రాఘవులు, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమ్మరావు, తేళ్ల అరుణ ప్రసంగించారు.

స్పందన అర్జీలు పరిష్కరించండి

- డిఆర్ఒ ఆర్.శ్రీలత - స్పందన కార్యక్రమానికి విశేష స్పందన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆర్.శ్రీలత స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన హాలులో 'డయల్ యువర్ కలెక్టర్'. 'స్పందన' కార్యక్రమాలలో ప్రజల నుంచి ఆమె ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ స్పందన అర్జీలపై ప్రత్యేక దష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను నిర్దిష్ట గడువులోపు సహేతుకంగా పరిష్కరించాలన్నారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీ పరిష్కరించే విధంగా అధికారులు దష్టి సారించాలని డిఆర్ఒ తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్‌కి విశేష స్పందన

తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ప్రజలు ఫోన్‌లో ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల స్థాయి అధికారులను డిఆర్ఒ ఆదేశించారు. వీటిపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడారు.

పోలీసుల ఆధీనంలో కారుమంచి..

హై సెక్యూరిటీతో ఇబ్బందులెదుర్కొన్న గ్రామస్తులు, పచ్చాకు కూలీలు

ప్రజాశక్తి-టంగుటూరు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో టంగుటూరు మండలం, కారుమంచి గ్రామం అంతా ఆదివారం సాయంత్రం నుండి పోలీసుల ఆధీనంలోకి వెళ్లిపోయింది. సీఎం పర్యటన సందర్భంగా బయట నుండి గ్రామానికి వచ్చే అన్ని దారులనూ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గ్రామం ప్రారంభంతో పాటు కారుమంచిలోని పలు ప్రాంతాలలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి పాదచారులతో పాటు వాహనదారులను కూడా పక్కకు మళ్ళించారు. సీఎం హెలిపాడ్ స్థలం హైస్కూల్ గ్రౌండ్‌తో పాటు.. వరికూటి కోటమ్మ భౌతిక కాయం ఏర్పాటు చేసిన ప్రదేశాలే కాకుండా గ్రామం మొత్తాన్ని పోలీసులు చుట్టుముట్టారు. వీఐపీలు, అధికారులు మినహా గ్రామస్తులతో పాటు మీడియాపైనా పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. ఎస్పీ మలికగర్గ్‌తో పాటు ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, ఐదుగురు డిఎస్పీలు, 16 మంది సీఐలు, 60 మంది ఎస్ఐలతో పాటు మొత్తంగా 1200 మంది పోలీస్ సిబ్బంది కారుమంచి గ్రామంలో భారీగా మోహరించి సీఎం బందోబస్తు నిర్వహించారు. పోలీసుల పటిష్ట బందోబస్తుతో గ్రామస్తులతో పాటు గ్రామంలో పనిచేసే పచ్చాకు కూలీలు సైతం మధ్యాహ్న భోజనానికి.. ఆ ప్రాంతాలలో ఉన్న తమ నివాసాలకు కూడా వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూలీలు తమ నివాసాలకు వెళ్లేందుకు అనుమతించకపోవడంతో కొన్ని సందర్భాలలో వారు పోలీసులతో వాదనకు దిగారు. ఎట్టకేలకు సీఎం జగన్ కారుమంచి పర్యటన విజయవంతం అవడంతో జిల్లా యంత్రాంగం అంతా ఊపిరి పీల్చుకుంది.



ప్రజలకు అభివాదం చేస్తున్న సిఎం జగన్

కారుమంచిలో 1.05 గంటలు..

శింగరాయకొండ: వరికూటి అశోక్‌బాబు తల్లి వరికూటి కోటమ్మ మృతికి నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సోమవారం నాడు టంగుటూరు మండలం, కారుమంచికి వచ్చారు. కారుమంచిలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌కు తాడేపల్లి నుంచి హెలికాప్టర్లో ముఖ్యమంత్రి 11.16 నిమిషాలకు చేరుకున్నారు. ముఖ్యమంత్రితో జిల్లా ఇన్చార్జి మంత్రి మేరుగ నాగార్జున, మాజీ మంత్రి, ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి హెలికాప్టర్లో వచ్చారు. అక్కడ మంత్రి ఆదిమూలపు సురేష్, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ మల్లికాగర్గ్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి, చీరాల శాసనసభ్యులు కరణం బలరామకష్ణమూర్తి, కనిగిరి శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్, గిద్దలూరు శాసనసభ్యులు అన్నా రాంబాబు, మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి, సంతనూతలపాడు శాసనసభ్యులు సుధాకర్‌బాబు, దర్శి శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, అద్దంకి ఇన్చార్జి బాచిన కష్ణచైతన్య, చీరాల ఇంచార్జి కరణం వెంకటేష్ తో కలిసి సిఎం జగన్ వరికూటి కోటమ్మ మతదేహం వద్ద పుష్పగుచ్చం ఉంచి.. నివాళులర్పించారు. అనంతరం కొండపి నియోజకవర్గానికి చెందిన ఎంపీపీ, జడ్పిటీసీలతో మాట్లాడారు. అనంతరం 12.21 నిమిషాలకు హెలికాప్టర్లో తాడేపల్లికి వెళ్లారు.



సిఎం జగన్‌తో మాట్లాడుతున్న బూచేపల్లి



నిరసన తెలుపుతున్న వైద్యులు

వైద్యులపై

పోలీసుల జులుంకు ఖండన

ప్రజాశక్తి-చీరాల

రాజస్థాన్లో ప్రైవేటు వైద్యులు శాంతి యుతంగా నిరసన తెలియజేస్తుంటే వారిపై పోలీసులు లాఠీలు ఝులిపించటం దారుణమని చీరాల ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి. శ్రీదేవి, డాక్టర్ పి. శ్రీకాంత్ లు పేర్కొన్నారు.రాజస్తాన్లో వైద్యులపై జరిగిన దాడికి నిరసనగా సోమవారం ఎంఏ హాలులో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల రాజస్తాన్ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య హక్కు చట్టం అమల్లోకి తెచ్చిందన్నారు. దీనికి నిరసనగా రాజస్తాన్లో శాంతియుతంగా కొందరు ప్రైవేటు వైద్యులు నిరసన తెలియజేస్తుంటే వారిపై పోలీసులు దాడిచేశారని దీనిని రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు. లోపభూయిష్టమైన చట్టం తెచ్చి ప్రైవేటు వైద్యశాలలను బలిపశువు చేయడం సరికాదన్నారు. పోలీసుల తీరుకు నిరసగా రాష్ట్రవ్యాప్తంగా ఐఎంఏ కేంద్ర కార్యాలయం నిర్దేశం మేరకు వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి సేవలందిస్తూ నిరసన తెలియజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు భవానీప్రసాద్, రమణారావు పాల్గొన్నారు.



సిఎంకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

సిఎంకు వినతి

కనిగిరి నగరంలో విశ్వ బ్రాహ్మణ కార్పెంటర్ వర్కర్లకు చెందిన మూడు షాపులు ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. బాధితులైన ముగ్గురు విశ్వబ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవాలని సిఎం జగన్‌కు టంగుటూరులో వినతి పత్రం అందజేశారు.

- ప్రజాశక్తి, టంగుటూరు

డ్రైనేజి, తాగునీటి సమస్యలను

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్), వైద్య కళాశాల ప్రాంగణాల్లో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థలకు సంబంధించిన ఉన్న సమస్యలను అధ్యయనం చేసి.. ఉన్నతాధికారులకు నివేదిస్తామని సూపరెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్ వెల్లడించారు. ఉన్నతాధితాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఒంగోలు కార్పొరేషన్ అధికారులు జిజిహెచ్, మెడికల్ కాలేజీల ప్రాంగణాలను పరిశీలించారు. ఒంగోలు కార్పొరేషన్ ఎంఇ కె మాల్యాద్రి, డిఇ పద్మజతో పాటు కార్పొరేషన్ అధికారులు డ్రైనేజ్ వ్యవస్థను ఆసాంతం



పరిశీలిస్తున్న భగవాన్‌నాయక్

పరిశీలించారు. మెయిన్ డ్రైన్, అంతర్గత డ్రైన్లు, ఎస్‌టిపి ట్యాంకుల పనితీరును జిజిహెచ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రధాన డ్రైన్లు చాలా మేరకు మూసుకుపోయి ఉండటాన్ని వీరు గమనించారు. శానిటేషన్ సిబ్బంది వారికి డ్రైనేజీ సమస్యలను వివరించారు. పరిశీలనలో ఆర్ఎంఒ డాక్టర్ చైతన్య, అసిస్టెంట్ ఆర్ఎంఒ డాక్టర్ మాధురి, కార్పొరేషన్ ఎఇ బాల కోటయ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనోహర్‌రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ పిచ్చయ్య, టాప్ ఇన్స్‌పెక్టర్ నరసింహారావు, పంబ్లింగ్ సూపర్‌వైజర్ మల్లికార్జున పాల్గొన్నారు.